## క్లుప్తంగా

### ముగిసిన శిక్షణా తరగతులు



**చిల్లకల్లు(జగ్గయ్యపేట):** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న ప్రణాళికలను సర్పంచ్‌లు, కార్యదర్శులు అమలు చేసి పంచాయతీల ఆదాయాన్ని పెంచడంతోపాటు గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపించాలన్నారు. క్రమం తప్పకుండా పాలకవర్గ సమావేశాలు నిర్వహించడంతోపాటు అభివృద్ధి తీర్మానాలు కూడా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మావతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**పెనుగంచిప్రోలు:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ స్టేషన్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామస్తులంతా మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ ఎ శాంతిలక్ష్మి మాట్లాడుతూ పచ్చదనం పెంపుదల ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, వైద్యాధికారి నాగలక్ష్మి, డెప్యూటీ ఎంపీడీఓ కె.సుబ్బారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### బాణసంచా దుకాణాలు పరిశీలన



**పెనుగంచిప్రోలు:** దీపావళి సందర్భంగా తాత్కాలికంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు భద్రతా నిబంధనలను తప్పకుండా పాటించాలని తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి సూచించారు. పెనుగంచిప్రోలులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను శనివారం ఆమె పరిశీలించారు. బాణాసంచా దుకాణాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దుకాణాల వద్ద అన్నిరకాల జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

### ఆలయానికి గ్రానైట్ రాళ్లు వితరణ



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో యాగశాల వద్ద అవసరమైన 1400 అడుగుల గ్రానైట్ రాళ్లను ఖమ్మం జిల్లా ఖానాపురం గ్రామానికి చెందిన నల్లమోతు శ్రీను, మమత దంపతులు శనివారం విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా దాతలను వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### నవగ్రహాలకు తైలాభిషేకం



**నందిగామ టౌన్:** నందిగామతోపాటు మండలంలోని ఆయా శైవ క్షేత్రాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి ఆలయాలలోని నవగ్రహాలకు అర్చక స్వాములు తైలాభిషేకం చేశారు. తొలుత నవగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల గోడు పట్టించుకోని కూటమి పాలకులు

**పరిటాల(కంచికచర్ల):** రైతులు పండించిన వరి, మిరప, పత్తి, మొక్కజొన్న మినుము, పెసర పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నప్పటికీ వారిని ఆదుకునే విషయంలో కూటమి పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. కంచికచర్ల మండలం పరిటాలలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి చింతా రవీంద్రనాథ్ గృహంలో మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, పార్టీ పట్టణ అధ్యక్ష్యుడు వేమా సురేష్‌బాబు, జిల్లా పార్టీ బీసీ సెల్ అధ్యక్ష్యుడు మార్త శ్రీనివాసరావు శనివారం విలేకరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క రైతు కష్టాల ఊబిలో చిక్కుకోలేదని, పంటల సాగుకన్నా ముందుగానే రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించినట్లు గుర్తుచేశారు. వరిధాన్యాన్ని సైతం కల్లాల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రైతులకు సరిపడా యూరియా కూడా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని విమర్శించారు.

రైతులకు యూరియా అందించలేక యూరియా వాడకం తగ్గించాలని స్వయానా సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడమే కూటమి పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.

**ధరల స్థిరీకరణ నిధి ఏది?...**

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

> **కల్తీ మద్యం సరఫరా...**
>
> గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా కల్తీ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని హరిజగన్నాధరావు, సురేష్‌బాబు, మార్త శ్రీనివాసరావు విమర్శించారు. ఒక్కో మద్యం బాటిల్‌పై అదనంగా రూ.10 వసూలు చేసి బెల్టుషాపులకు కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు మద్యంత్రియులే స్వయంగా చెబుతున్నారన్నారు. నాణ్యమైన మద్యం అందిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు నేడు కల్తీ మద్యం సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిధి ఏర్పాటు చేసి మార్కెట్‌లో పోటీని పెంచి రైతులకు మేలు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విశేష సేవలందించారని వివరించారు.

**నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్..**

ఈ ఏడాది అగస్టు, సెప్టెంబర్ నెలల్లో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ-క్రాప్‌ను వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. సీఎం యాప్‌ను పక్కన పెట్టారని, ఉచిత పంటల బీమాకు పాతరేశారని, సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తేశారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు గుదే అక్కారావు, కోటేరు ముత్తారెడ్డి, కాలవ పెదబాబు, తంగెళ్లమూడి రామారావు, కర్ల రామకృష్ణ, జాన్ బాబు, ఏసుబాబు, జిక్కుల నరసింహారావు, ప్రత్తిపాటి కృష్ణమూర్తి, ఆలోకం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా దుకాణాలు భద్రమేనా?

- భద్రతా చర్యలను తనిఖీ చేయని అధికారులు ...
- అనుమతుల మంజూరులో తీవ్రజాప్యం
- ప్రమాదాలపై ఆందోళనలో స్థానికులు

**నందిగామరూరల్:** దీపావళి పండుగ సందర్భంగా నందిగామ పట్టణంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాల భద్రతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏటా మధిర రోడ్డులోని మైదానంలో ఏర్పాటు చేసే బాణాసంచా దుకాణాలను ఈ ఏడాది పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో శ్రీకరం కల్యాణ మండపం పక్కనున్న దేవాదాయ శాఖకు చెందిన స్థలంలో ఏర్పాటు చేశారు. అయితే చందర్లపాడు రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా పక్కనే కళాశాల, కల్యాణ మండపం, సాయి అయ్యప్ప ఆలయంతోపాటు సమీపంలోనే పెట్రోల్‌బంకు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితేంటనే ఆందోళన స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. వారం రోజులుగా కలెక్టర్ ఆయా బాణాసంచా దుకాణాలను, ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలిస్తూ అధికారులకు ఆదేశాలిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు నెలకొన్నాయి.

**మంజూరుకాని లైసెన్స్‌లు..**

దీపావళి బాణాసంచా విక్రయాల దుకాణాల కోసం 25 దరఖాస్తులు రాగా ఐదు దరఖాస్తులను తగిన ధ్రువీకరణపత్రాలు లేవనే కారణంగా అధికారులు తిరస్కరించినట్లు సమాచారం. దీపావళి పండుగను సోమవారం జరుపుకోనుండటంతో దరఖాస్తుదారులు శ్రీకరం కళ్యాణ మండపం పక్కనున్న దేవాదాయశాఖ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటుండగా, మిగిలిన 20 దరఖాస్తులకు సంబంధించి అధికారులు శనివారం రాత్రి 9గంటల వరకు లైసెన్స్‌లు మంజూరు చేయకపోవడం గమనార్హం.



నందిగామ పట్టణంలోని దేవాదాయశాఖ స్థలంలో ఏర్పాటు చేస్తున్న బాణాసంచా విక్రయ దుకాణాలు

**సెలవు రోజుల్లో అధికారులు పర్యవేక్షించేనా?.**

దీపావళి పండుగ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆది, సోమవారాలను సెలవు దినాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయా స్థలంలో దుకాణాదారులు ఎటువంటి భద్రతా చర్యలు పాటిస్తున్నారనే విషయాన్ని శనివారం రాత్రి వరకు అధికారులు పరిశీలించకపోవడం గమనార్హం. అనుమతుల మంజూరులో అధికారులు వహిస్తున్న అలసత్వంపై ఓవైపు దుకాణదారులు అసంతృప్తిగా ఉండగా, భద్రతా చర్యల పరిశీలించకుండా సంబంధిత శాఖల అధికారులు అనుమతులు ఇచ్చే అంశంపై నందిగామ పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ప్రమాదం సంభవిస్తే ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు సైతం దుకాణాల వద్ద చేయాల్సిన బాధ్యత దరఖాస్తుదారులపై ఉంది. ఈ అంశాలన్నీ కూడా అధికారుల తనిఖీల్లో వెల్లడయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. భద్రతా చర్యలపై తనిఖీలు చేపట్టకుండా ఉత్తర్వులు జారీచేస్తే ఎలా అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంతో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బాణసంచా దుకాణాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఉండేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# మొక్కలు నాటిన అధికారులు

**నందిగామరూరల్:** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఏపీడీ లక్ష్మీకుమారి కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు శనివారం నందిగామ మండలంలోని జొన్నలగడ్డ బీసీ హాస్టల్ ఆవరణ, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గి స్వచ్ఛమైన గాలి అందుతుందన్నారు. గ్రామంలో వ్యక్తిగత కంపోస్టు పిట్‌లను తవ్వించి చెత్త నుంచి ఇళ్లలోనే ఎరువులు తయారు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కలిగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రజలు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏపీడీ లక్ష్మీకుమారి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద సాగు చేస్తున్న మునగ, నిమ్మ తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లగడపాటి పుష్పరేణి, ఎస్ఆర్జీఎస్ ప్రోగ్రాం అధికారి ప్రసాదరావు, ఏపీవో శరత్‌బాబు, కార్యదర్శి స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

### పాలకవర్గ సభ్యులకు ఘనసత్కారం

**నందిగామరూరల్:** ఆలయ పాలకవర్గ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల అభినంధన సభను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, సభ్యులను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా పాలకవర్గ సభ్యులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు రాటకొండ చంద్రశేఖర్, మద్దుకూరి రామారావు, సురేష్, వీరాస్వామి, రేపాల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

### రేపు నరకాసుర వధ కార్యక్రమం

**జగ్గయ్యపేట అర్బన్:** నరక చతుర్దశి సందర్భంగా సోమవారం సాయంత్రం పట్టణంలోని పాతపేట గడ్డ మీద నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పెద్ద రామాలయం ఈవో సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు పెద్ద రామాలయం గుడి నుంచి సత్యభామ, శ్రీకృష్ణస్వామి వారు ఊరేగింపుగా వచ్చి పాతపేట గడ్డ మీద నరకాసుర వధ చేస్తారని వివరించారు. పట్టణ ప్రజలు హాజరై నరకాసుర వధ ఘట్టాన్ని తిలకించాలని ఈవో కోరారు.

# వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసు

**కంచికచర్ల:** అరెస్టు చేసిన రైతులను విడిచిపెట్టాలని కోరిన వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం రాత్రి కంచికచర్లలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గతనెల సెప్టెంబర్ 29వ తేదీనని కంచికచర్ల మండలం మోగులూరు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఒకరిపై మరొకరు స్థానిక వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులు పెట్టుకున్నారు. ఈ విషయంపై టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు ముగ్గురు రైతులను రాత్రి సమయంలో అరెస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు సీఐ చవాన్‌ను కలిసి తమ పార్టీ కార్యకర్తలతోపాటు రైతులను విడిచిపెట్టాలని కోరగా, అందుకు సీఐ ససేమిరా అన్నారు. పోలీసుస్టేషన్ నుంచి బయటికి వెళ్లాలంటూ నాయకులపై కేకలు వేశారు. ఈక్రమంలో పోలీసులు అరెస్ట్ చేసిన వారిని అక్టోబర్ ఒకటోతేదీన నందిగామ కోర్టులో హాజరుపర్చగా కేసులోని నిందితులకు 41ఎ నోటీసు ఇవ్వాలంటూ న్యాయమూర్తి కంచికచర్ల పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. ఇది జీర్ణించుకోలేని పోలీసులు వారిని విడిపించడానికి వచ్చిన వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల రమేష్, రాయల నరసింహారావు, ముప్పాళ్ల శివాజీలపై శుక్రవారం రాత్రి అక్రమంగా కేసు బనాయించారు. అయితే టీడీపీకి చెందిన వారే ఫేక్ ఐడెంటితో ఆ పోస్టులు పెట్టినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు చెబుతుండటం గమనార్హం.

# విద్యార్థులకు ఆటల పోటీలు



పేటలో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు, విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

**జగ్గయ్యపేటఅర్బన్:** స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేశ్వరరావు, జిల్లా లీగల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులు, పోక్సో చట్టం, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

**చిల్లకల్లు(జగ్గయ్యపేట):** పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ట్రైనీ ఎస్ఐ మణికంఠ శనివారం తెలిపారు. మండలంలోని త్రిపురవరం గ్రామంలో నిర్మానుష్య ప్రాంతంలో పేకాడుతున్నట్లు సమాచారం అండంతో పోలీసులు దాడిచేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 19,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మణికంఠ వివరించారు.

# సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

**జగ్గయ్యపేట అర్బన్:** పర్యావరణ హిత విద్యుత్ వినియోగం, ప్రోత్సాహం సమయానుకూలమైన చర్య అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. సోలార్ ప్యానల్స్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇండోర్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సోలార్ ఎగ్జిబిషన్‌లో ఎమ్మెల్యే తాతయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యశక్తి ఆధారిత పరికరాల వినియోగం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన శక్తిని అందించడమే కాకుండా విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గిస్తుందన్నారు.సోలార్ ప్యానెల్ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించాచరు. సోలార్ ప్యానెల్స్, హోమ్ ఇన్వర్టర్లు, ఎనర్జీ సేవింగ్స్ లైట్స్, స్మార్ట్ మీటర్ల వంటి పరికరాల ప్రదర్శనను పరిశీలించి ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, సీటీవో అధికారులు, వ్యాపారవేత్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**నందిగామ పట్టణంలో..**

**నందిగామటౌన్:** ప్రధానమంత్రి సూర్యఘర్‌లో భాగంగా గృహాలపై, పంట పొలాలలో పంపు సెట్లకు సోలార్ ప్యానల్స్ అమర్చుకునేవారికి జీఎస్టీని 12 నుంచి 5శాతానికి తగ్గించినట్లు విద్యుత్ శాఖ ఈఈ వసంతరావు, డీఈఈ స్టాలిన్ కుమార్ తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని వికసిత భారత్, మేక్ ఇన్ ఇండియాలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోలార్ ప్యానల్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆర్డీవో బాలకృష్ణ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబు నాయక్, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు



విద్యుత్ శాఖ అవగాహన ర్యాలీలో అధికారులు, సిబ్బంది

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జడ్జి వందన

**నందిగామరూరల్:** విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వందన సూచించారు. పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వందన మాట్లాడుతూ నేడు మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కష్టపడి చదువుకుంటూ అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకున్నవారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు అందుతున్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, న్యాయవాదులు అద్దంకి మణిబాబు, రామారావు, వేల్పుల కిషోర్, నంద్రు శ్రీరామ్మూర్తి, కొమ్మినేని మాలేశ్వరరావు, చెరుకుమల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్జి వందన

### రైతు సంక్షేమానికి కృషి

**చందర్లపాడు(నందిగామ టౌన్):** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో రైతు నేస్తం, పంట రుణాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు నేస్తం ద్వారా ఆరుగురు రైతులకు రూ. 60 లక్షల పంట రుణాలను అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

### దీపావళి మందుల సందడి

**జగ్గయ్యపేట అర్బన్:** పట్టణంలోని స్థానిక బలుసుపాడు రోడ్‌లోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా ప్లాట్స్‌లో, మార్కెట్ యార్డులో, ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో, బలుసుపాడు రోడ్‌లో ఏర్పాటుచేసిన పర్మినెంట్ దీపావళి మందుల దుకాణం వద్ద సందడి నెలకొంది. గతంలో ఐదు రోజుల పాటు అమ్మకాలకు అధికారులు అనుమతి ఇవ్వగా ఈసారి రెండు రోజుల ముందే అనుమతి ఇచ్చారని వ్యాపారులు తెలిపారు.

# భద్రతా నియమాలు పాటించాలి

**నందిగామరూరల్:** ప్రజలు రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ సెంటరులో శనివారం నిర్వహించిన రవాణా వాహనాల ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రజలకు రవాణా భద్రతపై అవగాహన కలిగించటంలో రవాణాశాఖ కీలక పాత్ర వహిస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాలు భవిష్యత్‌కు శుభసూచికమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ పూర్ణిమ, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రవాణా వాహనాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి కరపత్రాలు అందజేస్తున్న విప్ తంగిరాల సౌమ్య

# టీచర్ల అభ్యున్నతికి యూటీఎఫ్ కృషి

**గండేపల్లి(కంచికచర్ల):** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఎనలేని కృషిచేస్తోందని యూటీఎఫ్ కంచికచర్ల మండల జనరల్ సెక్రటరీ కామా ప్రభాకరరావు తెలిపారు. డీఎస్సీ 2025 ద్వారా గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరిన వారికి శనివారం ఆయన శాలరీ పర్టిక్యులర్ పుస్తకాలు అందజేశారు. విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలు తక్షణమే ఇవ్వాలన్నారు. 11వ పీఆర్సీ ఎరియర్స్, డీఏ అరియర్స్ ఇవ్వలేదన్నారు. కనీసం 12వ పీఆర్సీ కమిషన్‌ను వేయలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కోశాధికారి మల్లారపు రామారావు, నాయకులు రఫీ, కుమారస్వామి, జెర్రిపోతుల జ్యోతి, జెర్రిపోతుల కరుణశ్రీ, కనకదుర్గ, పాకాలపాటి ప్రభూజీ, కాంద్రు పుల్లారావు, మల్లారపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు శాలరీ పర్టిక్యులర్ పుస్తకాలు అందజేస్తున్న కామా ప్రభాకర్

### సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

**నందిగామ రూరల్:** రాష్ట్రప్రభుత్వం 28వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను మోసం చేసిందని సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయకపోవడాన్ని నిరసిస్తూ మండలంలోని చందాపురంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుటసీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ జేఏసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని నమ్మించి చివరకు యాజమాన్యానికి, ప్రభుత్వానికి లొంగిపోయి కార్మికుల గొంతు కోసిందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు శ్రీనివాసరావు, కిరణ్, కోటిరెడ్డి, సాల్మన్, సమీరా, కార్మికులు పాల్గొన్నారు.



చందాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

# జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు

**మైలవరం:** జి.కొండూరు మండలం కవులూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ శనివారం తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన డివిజనల్ లెవెల్ సెలక్షన్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు కె. కోమల్‌దీప్, వి. సిద్ధార్థ, డి. విక్రమ్, ఎం. మున్న ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీడీ పి. శ్రీలతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.